

# పుస్తక పరిచయం




***Published by :***
***K.Padma***
***Kasturi Pracuranalu***
***Plot# 32, Dammayiguda***
***HYDERABAD – 500 083***
***Phone:98496 17392***

***Sole Distribution: Navodaya Book House***

**కథలు, నవలలు, వ్యాసాలు,** యదార్థగాథలు, చారిత్రాత్మకాలు, సమకాలీన సమస్యలపై విశ్లేషణలు..ఎన్నో సాహితీప్రక్రియల్లో తనని తాను నిరూపించుకున్న రచయిత కస్తూరి మురళీకృష్ణ గారు. ఆయన కలంనుంచి వెలువడిన విభిన్న తరహా కథల సంపుటి ఈ పుస్తకం. తెలుగులో శాస్త్రవిజ్ఞానాన్ని ప్రాతిపదికగా చేసుకుని వ్రాసిన రచనలు చాలా పరిమితంగా వెలువడ్డాయి. ఇలాంటి రచనలు చేయడానికి కేవలం కల్పనే కాక, ఎంతో విషయసేకరణ కూడా చెయ్యాల్సి ఉంటుంది. ఊహనీ, సైన్సునీ సరైన పాళ్ళలో రంగరించి పాఠకులని కట్టిపడేసేలా వ్రాయడం కత్తిమీద సాములాంటిది. సైన్సుఫిక్షన్ పేరుతో సేకరించిన విషయాలన్నింటినీ వ్రాసుకుంటూ పోతే అందులో ఫిక్షన్ కంటే సైన్సే ఎక్కువగా కనిపిస్తుంది. లోగడ తెలుగులో ఇతర రచయితలు వ్రాసిన కొన్ని నవలల విషయంలో ఇదే జరిగింది. మురళీకృష్ణగారు మాత్రం ఈ విషయంలో అత్యద్భుతమైన విజయం సాధించారు. సైన్సు ఫిక్షన్ అని చెప్పినా సైన్సు విశేషాలని అంతర్లీనంగానే ఉంచుతూ, అవసరమైనంత వరకే ముందుకి తీసుకొచ్చి సాంఘిక, సస్పెన్స్ కథలకి ఏమాత్రం తీసిపోకుండా ఈ కథలని తీర్చిదిద్దారు. అత్యంత సంక్లిష్టమైన సాంకేతిక విశేషాలని సైతం అరటిపండు వొలిచి అరచేతిలో పెట్టినట్లు సరళమైన శైలిలో వివరించారు. ఈ పది కథల్లోనూ ఒకదాని నీడ మరో దానిమీద పడకుండా చాలా జాగ్రత్త వహించారు. బుధగ్రహ వాతావరణం, సైబర్ యుద్ధాలు, కల్పిత ప్రపంచంలో కేళీ విలాసాలు, అధ్యాత్మిక్ - అద్వైత్‌లతో చూపించిన పునఃసృష్టికి పురిటి నొప్పులు - ప్రతి కథా ఒక సరికొత్త ప్రపంచాన్ని మనసు ముంగిళ్ళలో ఆవిష్కరిస్తాయి. అంతేకాదు, అనాయాసంగా పాఠకుడ్ని ఆ వాతావరణంలోకి తీసుకెళ్ళిపోతాయి. చక్కటి ప్రయత్నాన్ని అర్థవంతంగా, సమర్థవంతంగా తెలుగు పాఠకులకి అందించిన మురళీకృష్ణగారు అభినందనీయులు.

***




**Writer:**

**KS Panduranga Rao**
**21/414-2 Bhaskarapuram**
**MACHILIPATNAM – 521 001**
**Phone: 08672 - 222975**

**మహాభారతంలో కురుక్షేత్ర యుద్ధం** ముగిశాక భీష్మాచార్యులవారు మాఘ శుద్ధ ఏకాదశి రోజున స్వేఛ్ఛామరణాన్ని కౌగలించుకుని ఈ లోకాన్ని వీడివెళ్ళారు. తదుపరి కార్యక్రమాలన్నీ ముగిశాక ధర్మరాజుని మరోసారి వైరాగ్యం ఆవరించింది. 'కురుక్షేత్ర యుద్ధంలో ఎంతోమంది చావుకి కారణమయ్యాను. మనశ్శాంతికోసం అడవులకి వెళ్ళిపోతాను అనుజ్ఞనివ్వండి' అని శ్రీకృష్ణుడ్ని అడిగాడు. అప్పుడు శ్రీకృష్ణుడు 'అడవులకి వెళ్తే మాత్రం మనశ్శాంతి దొరుకుతుందని నమ్మకమేమిటి? యుద్ధంవల్ల కలిగిన పాపం పోవడానికి, మనశ్శాంతికోసం అశ్వమేధయాగం చేస్తారు. నువ్వు కూడా అశ్వమేధయాగం చెయ్యి. చిత్తశాంతి లభిస్తుంది' అని సలహాయిస్తాడు...ఈ సంఘటన పునాదిగా సాగిన ఈ పుస్తకం వివిధ పండితులు వ్రాసిన మహాభారత కథల సారాంశంగా రూపుదిద్దుకుంది. సరళ గ్రాంధిక భాషలో సాగిన ఈ పుస్తకంలోని ప్రతి సంఘటన ఎంతో ఆసక్తికరంగా పాఠకులని అలరిస్తుంది. కథామూలం కురుక్షేత్ర యుద్ధానంతరమే ఐనా సందర్భానుసారం గతంలో జరిగిన ఎన్నో సంఘటనలని వివరణాత్మకంగానూ, విశ్లేషణాత్మకంగానూ చొప్పించి ఈ పుస్తకానికి సరికొత్త రూపాన్నిచ్చారు రచయిత కోడూరు శ్రీపాండురంగారావు గారు. ఈ గ్రంధరచనకు ఆంధ్ర మహాభారతం, జైమిని భారతం, హరివంశం, విజయవిలాసం లాంటి పది గ్రంధాలని తులనాత్మకంగా పరిశీలించి, కథకి అవసరమైన పాత్రలని, సంఘటనలని గుదిగ్రుచ్చారు. 23 అధ్యాయాలుగా సాగిన గ్రంధంలో మహాభారతంనుంచి ఎక్కువగా ప్రాచుర్యంలో లేని అనేక పాత్రలని , సంఘటనలనీ కూడా ఒక చోట తెలుసుకునే అవకాశం కల్పించారు. కోడూరు శ్రీపాండురంగారావు గారు 70 ఏళ్ళు పైబడిన వయసులో చేసిన ఈ కృషి, పరిశోధన యువరచయితలకి మార్గదర్శకం, స్ఫూర్తిదాయకం.

***

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI(Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568,USA**